


# 'ఉయబాలికన్నీయువర్ష

శ్రీరాజ్

నవ్వినా కన్నీళ్ళే వస్తాయి.

ఎందుకు.... ఎందుకు.... ఎందుకు?

మనిషిలో సంతోషానికి చిహ్నంగా కన్నీళ్లు వస్తాయనుకుంటే పొరపాటే అవుతుందేమో? వెలుగుని మింగటానికి చీకటి ఎప్పుడూ పొంచి ఉంటుంది. జీవితంలో రాబోయే చీకటికి-ఆ కన్నీళ్లు సంకేతం అంటే సరిపోతుంది.

నిజమే మరి. జీవితమంతా నవ్వుల మయమని, అలా అలా నవ్వుతున్నందుకే కన్నీళ్లు వస్తున్నాయని ప్రవీణ్ అనుకున్నాడుగాని అతి తొందరలో ఆ కన్నీళ్లు ఓ విషాదగాథకి దారితీస్తున్నాయని, ఎప్పుడూ ఊహించలేదు.

ఊహించనిది జరగడమే జీవితం కాబోలు.

ఆ రోజు—ఇంకా అతని కళ్ళలో మెదులుతూనే ఉంది.

పెళ్లి రోజు.... పెళ్లి రోజు .... పెళ్లి రోజు.

బీచ్‌లో వెన్నెల. సముద్రంలో కెరటాలు. ప్రవీణ్‌లో అల్లరి. శిరీషలో నవ్వులు. ఎవరూలేని చల్లనిచోటు. అక్కడ వెన్నెల, కెరటాలు, అల్లరి, నవ్వులు తప్ప మరేమీ లేవు. అక్కడ కాదు — అసలు వాళ్లిద్దరి జీవితాల్లో ఎప్పుడూ ఎక్కడా ఏ సందర్భంలో చీకటి, పెనుగాలి, బాధ, ఏడుపు లాంటివి తారసపడలేదు. ఆ ఇద్దరి మధ్య ఆర్థికమైన చిక్కుల తోరణాలు లేవు. వాళ్ళ పెద్దవాళ్ళ మధ్య సహజంగా డబ్బున్నవాళ్ళ గొడవలూ లేవు. అతనికి ఆమె మీద పిచ్చి ప్రేమ ఉంది. క్షణం విడిచి, ఆమెకి దూరంగా ఉండలేడు.

శిరీష నేలమీది జాబిలి. నీటిలో జాబిలి ముక్కలు ముక్కలుగా చెదిరిపోయి ఉంది. ఈ జాబిలి ఒక్కటిగా అతని బాహువుల్లో యిమిడిపోయింది. ఆమె ముంగురులు గాలికి కదులుతూ అతనిలో గిలిగింతలు పెడుతున్నాయి.

శిరీష చీరపైట తీసి - ఆ సముద్రం హోరు వినిపించకుండా వాళ్లిద్దరిమీద మేలిముసుగు చేసింది.

"హల్లో డాక్టర్! మీరు చాలా చెడ్డవారు" గుసగుసలు చెప్తున్నట్లు ఆమె నెమ్మదిగా అంది.

"ఎందుకనో?" ఆమె పెదవులమీద ఓ తియ్యటి ముద్రవేసి, చిలిపిగా ప్రశ్నించాడు అతను.

"నన్ను పెళ్ళిచేసుకున్నందుకు."

"వ్వాట్ .... నిన్ను పెళ్ళిచేసుకున్నందుకా?...."

"అవును. నన్ను పెళ్లిచేసుకోకుండా ఉంటే-మీ కీ పిచ్చి ఉండేదికాదు."

"ఇది పిచ్చి కాదు .... 'ప్రేమ' అంటాను."

"పిచ్చి ప్రేమ....మీ ప్రేమకి పాపం పగలూ రాత్రీ, ఇంటా బయటా, ఇరుకూ, విశాలం, తిండీ నిద్రా తెలియవు కాబోలు."

"ఊహూఁ.... ఏమీ తెలియవు, ఒక్క తియ్యదనం తప్ప."

ఆమెను కాసేపు మాట్లాడనివ్వలేదు తియ్యదనాన్ని గుర్తుచేస్తూ.

"అన్నట్లు .... ఈ తియ్యదనం ఎంత కాలం ఉంటుందో?"

"నా మనవడి ఫస్టు వెడ్డింగ్ యానివర్సరీ కూడా వచ్చేవరకు."

"అమ్మో.... ఆశ...."

ఇద్దరూ పకపకా నవ్వుకున్నారు.

అలా నవ్వుతుంటే అతని కళ్లు చెమ్మగిల్లాయి.

చెమ్మగిల్లిన ఆమె కళ్ళు వెన్నెల్లో స్పష్టంగా కనిపించాయి.

ఇల్లు చేరేసరికి రాత్రి పది దాటింది.

"మీరు కాసేపు అటు తిరుగుతారా, చీర కట్టుకుంటాను." అంది శిరీష, గది తలుపులు దగ్గరగా వేస్తూ.

"ఉన్నది మన మిద్దరమేగా.... నువ్వు చీర మార్చుకుంటే చూడాలని ఉంది" ప్రవీణ్ గోముగా ఆమె నడుంచుట్టూ చేతులు వేస్తూ అడిగాడు.

"ఉష్.... చెడు వినకూడదు చెడు మాట్లాడకూడదు. చెడు చూడకూడదు."


"ఈ సూక్తి ఆలుమగల మధ్య అన్వయించకూడదు. అయినా - దీన్ని చెడు అని ఎవరూ అనరు."

"అంటారు... బుద్ధిగా అటుతిరగండి" అంటూ అతన్ని వెనక్కి తిప్పి, కూర్చోబెట్టింది.

శిరీష కట్టుకున్న పట్టుబట్టలు మార్చుకుంటుంది.

అతని ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో ఆమె ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె సొగసులు చూస్తూ, ప్రవీణ్ ఓ క్షణం బరువుగా నిట్టూర్చాడు. ఒంట్లో విద్యుత్తు ప్రవహించినట్లయింది.

"శిరీ.... అక్కడ - ఆ పుట్టుమచ్చ ఎంతందంగా ఉందో తెలుసా?"



"ఏయ్, దొంగా.... ఇటు చూస్తున్నావా?"

"లేదు.... ఈ అద్దం నీ అందాలు చూపిస్తుంది."

అద్దం ఎదురుగా నిల్చొని, బట్టలు మార్చుకున్నందుకు సిగ్గేసింది. ఆమె సిగ్గుపడిపోయింది. సిగ్గుతో ముడుచుకుపోయింది. ఆమె సిగ్గును తొలగించటానికి ప్రవీణ్ చాలా చిలిపి పనులు చేశాడు. చివరికి శిరీషను దుప్పట్లోకి తీసుకుపోయాడు.

"శ్రీవారు అలిసిపోయారు.... పాలు తీసుకువస్తాను." ఆమె లేవబోయింది.

"ఊహూఁ.... వద్దు...." ఆమెను కదలనివ్వకుండా అతను గట్టిగా పట్టుకున్నాడు.

"చేసిన అల్లరి చాలు .... వడ్డీలు అడక్కండి." అతన్నుండి నెమ్మదిగా తప్పించుకుంది.

ఇద్దరూ ముసిముసిగా నవ్వుకున్నారు.

అలా నవ్వుతుంటే ఆమె కళ్లు చెమ్మగిల్లాయి.

చెమ్మగిల్లిన అతని కళ్లు లైటు వెలుగులో స్పష్టంగా కనిపించాయి.

అలా జీవితంలో చాలాసార్లు నవ్వుకున్నారు. నవ్విన ప్రతిసారి కళ్లు చెమ్మగిల్లాయి. వాళ్ళ సంసారంలో ఎన్నో అందమైన అనుభవాలు. ఆ అందమైన అనుభవాకి చరమగీతం ఆ రోజే, ఆక్షణమే పలుకుతుందని అతను గాని, ఆమెగాని ఊహించలేదు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా బరువుగా ముందుకు సాగిపోయాయి.

కేకలు.... కేకలు.... కేకలు.

వంటగది తలుపులన్నీ మూసి ఉన్నాయి. గదంతా గ్యాసుతో నిండి ఉంది. శిరీష పరాగ్గా స్టౌ వెలిగించింది. లోపల పేరుకున్న గ్యాసు భగ్గున మండింది. ఆ మంటల్లో ఆమె చిక్కిపోయింది. ఆమె కేకలకి ఇంట్లో అందరూ హడలిపోతూ లేచారు. ప్రవీణ్ దిగ్గున లేచి, వంటగదివేపు పరుగు తీశాడు.

మంటలు.... మంటలు.... మంటలు.

ప్రజ్వరిల్లుతున్న నీలిమంటల్లో శిరీష మెలికలు తిరిగిపోతుంది. నిస్సహాయంగా పిచ్చిగా కేకలు వేస్తూంది. ప్రవీణ్ గదిలోకి ఉరకబోయాడు. కానీ, అతన్ని ముందుకి కదలనివ్వలేదు. బయటనుండి మంటలు ఆర్పడానికి ప్రయత్నాలు చేశారు.

కాసేపట్లో మంటలు అదుపులోకి వచ్చాయి.

అప్పటికే అంతా అయిపోయింది.

అందమైన పాలరాతి బొమ్మలాంటి శిరీష మంటల్లో కాలి, రబ్బరుబొమ్మలా అస్తవ్యస్తంగా తయారయింది. ఆమె తెల్లని శరీరం కారునలుపుగా మారి పోయింది. పొడుగాటి ఆమె శిరోజాలు సగం సగం కాలి చింపిరిగా కనిపిస్తున్నాయి. కలువల్లాంటి ఆమె కళ్లు పూర్తిగా మూసుకుపోయాయి. కట్టుకున్న షిఫాన్ చీర పీలికలు పేలికలై బూడిదయిపోయింది.

ఎందరి ప్రాణాలో నిలబెట్టిన డాక్టరు తన జీవనజ్యోతిని కాపాడలేక పోయాడు. ఆమె ఒక్కమాట కూడా చెప్పకుండ, అతన్ని ఒంటరిగా చీకటిలో వదిలి వెళ్లిపోయింది.

మర్నాడు - తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ మిత్రులు, ఆప్తులు టెలిగ్రాములు యిచ్చారు. ముందురోజు శుభాకాంక్షలందజేస్తూ - వాళ్ళు పంపిన గ్రీటింగులు యింకా చూడనేలేదు. నిన్నటి సరదాలు ఇంకా కళ్ళలో చెరిగి పోలేదు. ఈరోజు కళ్ళముందు విషాదం నమ్మలేనట్లు కనిపిస్తుంది. నిన్న భ్రమ ఈ రోజు నిజం. నిన్న వెలుగు. ఈ రోజు చీకటి. నిన్న నవ్వులు. ఈ రోజు ఏడుపు. నిన్న యిద్దరు. ఈ రోజు ఒక్కరు. నిన్నటికి ఈ రోజుకి చాలా దగ్గర సంబంధం. కన్నుమూసి తెరచినంత దగ్గర సంబంధం. కానీ, నవ్వినా ఏడ్చినా - వచ్చే కన్నీరులో ఎంతో వ్యత్యాసం.

* * *

చీకటి.... చీకటి.... చీకటి....

ఆ చీకటిలో ఆ గదిలో ఒంటరిగా ప్రవీణ్ కూర్చున్నాడని జయకి తెలుసు. శిరీష పోయి ఆరు నెలలు గడిచి పోయాయి. చైతన్యస్రవంతి ఆగడం లేదు. ముందురోజుని మరిపిస్తూ నిన్న, నిన్న రోజుని మరిపిస్తూ ఈ రోజు, ఈ రోజుని మరిపిస్తూ రేపు రోజు వస్తుంది. మనసులోని గాయాలకి కాలం నవనీతం లాంటింది. ఆ ఇంట్లో యించుమించుగా అందరూ జీవనస్రవంతిలో కలిసిపోయారు.

కానీ, ప్రవీణ్ మాత్రం ఆ జ్ఞాపకాల నుండి, ఆ చీకటి నుండి బయటపడలేక పోతున్నాడు. అతను తన బాధ్యతలు మరిచిపోయాడు. హస్పిటల్‌కి వెళ్ళడం మానుకున్నాడు. భవిష్యత్తు గురించి ఆలోచించడం విరమించుకున్నాడు. తెలివిగల డాక్టరు చెయ్యిజారి పోతున్నందుకు అతని ప్రొఫెసర్లు విచారించారు. అతన్ని మామూలు మనిషిని చేయలేక అతని స్నేహితులు బాధపడ్డారు. కావలసినవాళ్లు తల్లిదండ్రులు అతనిలో మార్పును తీసుకురాలేక నిస్సహాయంగా నిట్టూర్చారు.

ఆ ఊళ్లో జయ మెడిసిన్ చదువుతుంది. లేడీస్ హాస్టల్లో ఉంటుంది. అప్పుడప్పుడు ఆ యింటికి వస్తుంది. అక్కా బావల అన్యోన్యత ఆ అమ్మాయికి బాగా తెలుసు. కథల్లోలాగా చకచక సాగిపోయే సన్నివేశాలు జీవిత కథల్లో కూడా ఉంటాయని జయకి యిప్పుడే తెలుస్తుంది.

జయ గదిలో లైటు వేసింది. గదంతా వెలుగు పరుచుకుంది.

శిరీష.... శిరీష.... శిరీష

అక్కడ ప్రతి గోడమీద, ప్రతి వస్తువుమీద ఆ పేరు కనిపిస్తుంది. పిచ్చిగా, ప్రేమగా, గుర్తుగా రాసినవి. లెక్కకి దొరకనన్ని పేర్లు, చాలా అందమైన పేరు.

"ఎవరు లైటు వేశారు?" వెలుగుని చూడ్డానికి అతని మనసు యిష్టపడలేదు.

"నేను.... జయను, బావగారూ!" జయ నెమ్మదిగా సమాధానం యిచ్చింది.

"వద్దు ... నన్ను చీకట్లో ఉండనీ, జయా!"

"ఎంత కాలం చీకట్లో ఉంటారు?"

"మీ అక్కను చేరేవరకు...."

కొన్ని క్షణాలు జయ మాట్లాడ లేదు.

"బావగారూ! పద్దెనిమిదేళ్ళు నేనూ, మా అక్కా ఒక్కటిగా జీవించాం. ఈ రోజు నేను అక్కను మరిచిపోయాను. కానీ, మీరూ అక్కా కలిసి మూడేళ్ళు తిరిగి ఉండొచ్చు. మీరు అక్కని ఎందుకు మరిచిపోలేకపోతున్నారు?"

అతను జీవం లేని నవ్వొకటి నవ్వాడు.

"నువ్వూ మీ అక్కా రక్తంలో రక్తం పంచుకున్నారు. కానీ, నేనూ మీ అక్కా ప్రాణంలో ప్రాణం పంచుకున్నాం."

"మీరు చాలా గొప్పవారు. మీ ప్రేమకి అక్క అర్హురాలు కాదు." హఠాత్తుగా ఇనుప తెరల మాటున దాచిపెట్టిన నిజాన్ని వెళ్ళడించడానికి జయ సిద్ధపడింది.

ఆ మాటలకి ప్రవీణ్ తలెత్తి, జయ వేపు చుర చుర చూశాడు.

"అవును, బావగారూ! ఇంత కాలమూ మీకీ నిజాన్ని చెప్పలేదు. కానీ ఈ రోజున మీరు అక్క జ్ఞాపకాలతో ఎవరికీ అందకుండా పోతున్నారనే భయంతో చెప్పటానికి సాహసిస్తున్నాను. అక్కమీద నిందలు వేసే నీచానికి నేను సిద్ధపడటంలేదు. నన్ను నమ్మండి."

అతను మాట్లాడలేదు.

"మీరనుకున్నట్లు మా అక్క మంచిదీ కాదు. పిచ్చిదీ కాదు. మిమ్మల్ని మాత్రమే ప్రేమించలేదు. మీ పెళ్ళికి ముందు మా ఊళ్ళో కమల్‌ని ప్రేమించింది. అతనితో కలిసి తిరిగింది."

ఆవేశంతో ప్రవీణ్ - జయ చెంప ఛెళ్ళు మనిపించాడు. తను ఆరాధించే మనిషి శీలం గురించి అనహ్యంగా మాట్లాడితే ఎవరూ సహించలేరు.

"గెటౌట్ ....ఐసే యూ గెటౌట్.." బిగ్గరగా అరిచాడు.

"బావగారూ! మీరు కొట్టినంత మాత్రాన నిజం అబద్ధంగా మారదు. ఆ పాత కథ చెరిగిపోదు. అర్హతలేని వాళ్ళను ఆరాధిస్తూ - మిమ్మల్ని మీరు నాశనం చేసుకోకండి." జయ విసురుగా బయటకి నడవబోయింది.

ఆ ఒక్క విషబిందువు అతని రక్తంలో ప్రతి అణువులో కలిసి, ప్రవహిస్తోంది.

"అగు.... ఆ పాత కథ ఏమిటో చెప్పు."

ఆమె ఆగిపోయింది. వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ - చెప్పడం మొదలుపెట్టింది.

"మా ప్రక్క వాటాలో కమల్ ఉండేవాడు. కమల్ చాలా అందంగా ఉంటాడు అక్క వయస్సే అతనిది కూడా. ఇద్దరూ కాలేజీలో ఫైనల్ బి.యస్సీ. చదివేవారు. ఇద్దరూ ఒకేచోట కలిసి చదువు గురించి చర్చించుకొనేవారు. బహుశా - ఆ చనువు వాళ్ళిద్దరి మధ్య ప్రేమకి దారితీసి ఉండొచ్చు. వాళ్ళు ఉత్తరాలు రాసుకొనేవారు. కలిసి సినిమాలకి షికార్లకి వెళ్ళేవారు. పెళ్ళిచేసుకోవాలనుకున్నారు కూడా. ఈ విషయాలు ఎప్పటికప్పుడు అక్క నాతో పూసగుచ్చినట్లు చెబుతుండేది చిన్నప్పట్నుంచి మా యిద్దరి మధ్య దాపరికాలు లేవు.

"పెళ్ళిచూపుల్లో మిమ్మల్ని చూశాక అక్క మనసు మార్చుకుంది. కమల్‌కి లేని హోదా మీకుంది. డాక్టరు భార్యగా మీతో బతకాలనుకుంది. కమల్‌తో తన నిర్ణయం చెప్పింది. అతను మొదట్లో అంగీకరించకపోయినా - చివరికి 'సరే' అని ఒప్పుకున్నాడు. ప్రేమని కమల్‌కి పరిమితంచేసి, పెళ్ళిమాత్రం మిమ్మల్ని చేసుకుంది. ఆ తర్వాత కమల్ ఆర్మీలో చేరి, నాగపూర్ వెళ్ళిపోయాడు."



మనసు మీద కొత్తగా ముద్రపడుతున్న ఓ పాత కథ.

ప్రవీణ్ ముఖం వివర్ణమయింది. జయ మళ్ళీచెప్పడం ప్రారంభించింది.




"బావగారూ! అక్క బ్రతికుంటే మీ కీ రహస్యం ఎప్పటికీ తెలీదు. మా స్వార్థం మీకు తెలియనివ్వదు. మా అక్క సుఖాన్నే కోరుకుంటాను.... ఇప్పుడు అక్క లేదు. ఆమె మీద ప్రేమతో మీ కాలాన్నీ, మీ వాళ్ళనీ దూరంచేసుకుంటున్నారు. మీరు ఏమై పోతారోనని బెంగగా ఉంది. అందుకే— ఈ నిజాన్ని దాచలేకపోయాను. కనీసం ఈ నిజం తెలిస్తే, మళ్ళీ మీరు మామూలు మనిషవుతారనే ఉద్దేశంతో చెప్పాను. దయచేసి—ఈ గుట్టు యీ నాలుగు గోడల మధ్య ఉండనివ్వండి. అక్కను మరిచిపొండి. మిమ్మల్ని అభిమానించే మనుషుల కోసం, మీ ఉన్నతిని కోరుకొనే తల్లిదండ్రుల కోసం – మీ బాధ్యతలు స్వీకరించండి. ప్లీజ్...."

జయ కంఠం పూడుకుపోయింది. అపై మాటలు పెకిలి రాలేదు. కళ్ళు నీళ్ళ పర్యంతం కాగా అక్కడ ఉండ లేక వెళ్ళిపోయింది.

అతని గుండెల్లో సన్న సన్నగా బాధ మొదలవుతుంది.

తను ప్రేమించి ఆరాధించిన మనిషిలో స్వార్థం, అవినీతి గూడు కట్టుకున్నాయని – ఆమె రక్తం పంచుకు పుట్టిన జయ కాకుండా మరెవరైనా చెప్పిఉంటే ప్రవీణ్ నమ్మేవాడు కాదు. ఆ క్షణంలో శిరీష లేని లోటు కన్నా, ఆమె చేసిన ద్రోహం అతన్ని కలవరపెడుతుంది.

* * *

నిజం.... నిజం.... నిజం.

ఆ నిజం తెలుసుకున్నప్పట్నుంచి ప్రవీణ్ మనసు అవమానంతో కుతకుత లాడిపోతుంది. ఆమె తనలో సగం, తనతో 'సగం'గా ఉంటూ, ఎలా మోస గించింది? అవినీతిలో అందాన్ని కోరుకొనే శిరీషను, ఆమె అందాన్ని ఎందుకు కోరుకున్నాడు?

అతనిలో ఎన్నో ఆలోచనలు మతి పోగొడుతున్నాయి.

గబగబా శిరీషకి సంబంధించిన వస్తువులన్నీ పెట్టెల నుండి, అలమరాల నుండి బయటకి లాగేడు. ఆమె బట్టలు పుస్తకాలు నేలమీదికి విసిరి కొట్టాడు. ఒక పెట్టెలో అడుగున ఉత్తరాల దొంతర్లు కనిపించాయి. వాటిని చేతుల్లోకి తీసుకున్నాడు.

ప్రేమ.... ప్రేమ.... ప్రేమ.

ప్రతి ఉత్తరంలో పిచ్చి కవిత్వం. ప్రతి వాక్యంలో ప్రేమ పదాలు. సిగ్గు విడిచి, రెక్క విప్పుకొని, వెక్కిరింతగా కనిపిస్తున్నాయి. అన్ని ఉత్తరాల్లో చివర 'లవింగ్లీ యువర్స్ – కమల్' అని ఉంది. శిరీష పుట్టింటినుండి తనకి రాసిన ఉత్తరాల్లో అలాగే– 'లవింగ్లీ యువర్స్– శిరీ' అని రాసేది. 'దయ బాలిక ల్లీ యువర్స్ – శిరీ' అని రాసి ఉండాల్సిం దనుకున్నాడు.

శిరీష మళ్ళీ బ్రతికి వస్తే, ఆమెను నిలువునా చీల్చి చంపేవాడు. అతని కసి తీర్చుకొనే వాడు.

శిరీష చచ్చిపోయిన తర్వాత–ఆమెకి రెండు మూడు ఉత్తరాలు వచ్చాయి. వాటిని చింపకుండా భద్రంగా దాచి ఉంచాడు. జ్ఞాపకం రాగా ఆ ఉత్తరాల్ని చించి చదివాడు. అందులో ఒకటి కమల్ రాసినది. రెండు రోజుల క్రిందట అందిన ఆ ఉత్తరం అతనిలో ద్వేషాన్ని రగిలించింది.

'డియర్ శిరీ!

నీకు కోపం వచ్చింది కదూ! అందుకే – ఉత్తరాలు రాయడం మానే శావు. అవునా? క్షమించు. నేను దూరంగా ఉన్నప్పటికీ నా మనసెప్పుడూ నీతోనే ఉంటుంది.

నేను సెలవుపెట్టి వస్తున్నాను. చూడమ్మాయ్! నీ బుంగమూతి కోపం పోగొట్టడం నాకు బాగా తెలుసు శుక్ర వారం మీ ఊరు గెస్టుహౌస్ దగ్గర కలుసుకుందాం. మధ్యాహ్నం నీ పతి దేవుడు ఉండడుగా. అదే మనకి మంచి సమయం. హల్లో సిల్లీ గళ్....నీ అందాలతో నాకు విందు చేయాలి సుమా! చాలా రోజులయింది.

అన్నట్లు – మా బ్రదర్.... అదే నీ పతిదేవుడు ఏం చేస్తున్నాడు?

ఎన్నెన్నో తియ్య తియ్యటి ముద్దులతో –

లవింగ్లీ యువర్స్, కమల్'

"కమల్.... యూ బ్లడీ ఫెలో...."
ప్రవీణ్ పిచ్చిగా అరిచి, పిడికిలి బిగించాడు.

శిరీష రూపం వికృతంగా కనిపిస్తోంది. ఆమె నవ్వులు అసహ్యంగా వినిపిస్తున్నాయి. ఆమె జ్ఞాపకాల పుటలు చిరిగిపోతున్నాయి. మనసనే పరిధినుండి ఆమె పూర్తిగా తొలగిపోవాలి! శీలం లేని ఓ ఆడదాని కోసం తను జీవచ్ఛవం కాకూడదు అనుకున్నాడు.

రేపే శుక్రవారం.

తనని మోసగిస్తున్న కమల్‌కి బుద్ధి చెప్పి, తన అనుమానాన్ని పూర్తిగా బలపరుచుకోమని మనసు మూలల్లో ఎక్కడో మిగిలిపోయిన సంస్కారం అతన్ని హెచ్చరించింది.

మిట్టమధ్యాహ్నం గుమ్మం దాటి బయటకివెళ్తున్న కొడుకుని చూసి, ప్రవీణ్ తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. చాలాకాలంగా అతను వీధిలోకి వెళ్ళడం మరిచిపోయాడు.


ఎండ తీక్షణంగా ఉంది. నీరసించిపోయిన శరీరం ఎండకి తట్టుకోలేక తూలుతున్నప్పటికీ అతను ఓపిగ్గా ఊరిచివర ఉన్న గెస్టుహౌస్‌వేపు దారి తీశాడు. అనుమానానికి బలం ఎక్కువ.

గెస్టుహౌస్‌కి ఒక ప్రక్క యిసుక తిన్నెలు, మరో ప్రక్క పచ్చని పైరులు తప్ప మరేమీ లేవు. ఏకాంతమైన ప్రదేశం. గెస్టుహౌస్‌కి దగ్గరలో ఓ యువకుడు తీవిగా నిలుచున్నాడు. బహుశా, అతనే కమల్ కావచ్చనుకున్నాడు, ప్రవీణ్.

"అగ్గిపెట్టె యిస్తారా?" కల్పించుకొని ఆ యువకుడితో ప్రవీణ్ మాట్లాడాడు.

"ష్యూర్....ష్యూర్...." అతను అగ్గిపెట్టె తీసి యిచ్చాడు.

ప్రవీణ్ సిగరెట్టు వెలిగించాడు. గట్టిగా రెండు దమ్ములాగేడు.




"మీరు ఈ ఊరువారు కాదా?"

"కాదు. నేను మా ఊరివాణ్ణి."

అతను జోక్ చేసి, అతనే నవ్వుకున్నాడు.

ప్రవీణ్ నవ్వలేదు.

"మీరు బొత్తిగా ఎండలో నిలబడి వున్నారు."

"ఇది మీకు ఎండ....నాకు మాత్రం పున్నమి వెన్నెల."

"ఎందుకనో?"

"ఓ పడుచువాడు ఎండను చూసి - వెన్నెలని ఎప్పుడనుకుంటాడో తెలుసా, మిస్టర్?....ఓ అపరంజి బొమ్మ తన అందాల్ని విందుచేయడానికి వస్తుందనుకున్నప్పుడు....బై ది బై ప్రేమంటే ఏవిటో మీకు నిజంగా తెలీదనుకుంటాను."

"ప్రేమలో నిజమేమిటో నా కిప్పుడే తెలుస్తుంది. మీ పేరు తెలుసుకోవచ్చా?"

"వై నాట్?....మై స్వీట్ నేమ్ కమల్" అతను చాలా బడాయిగా చెప్పుకున్నాడు.

కమల్....కమల్....కమల్.

ప్రవీణ్ పిడికిలి బిగించి, కమల్ ముఖమ్మీద ఒకటిచ్చాడు.

అతను కిందికి పడిపోయాడు. ప్రవీణ్ తన శక్తంతా కూడదీసుకొని, కమల్‌ని పట్టుకొని చావబాదాడు. అప్పటికిగాని అతనిలో కోపం చల్లబడలేదు.

ఎందుకో కమల్ అతనిమీద తిరగబడలేదు. "మీరెవరు?" అని మాత్రం రొప్పుతూ అడిగాడు.

"ఈ ఎండలో నువ్వు ఎవరికోసం ఎదురుచూస్తున్నావో ఆ దౌర్భాగ్యురాల్ని పెళ్లిచేసుకున్న ఓ పిచ్చివెధవని," ప్రతి మాటను నొక్కి పలికాడు, ప్రవీణ్.

"ఓ గాడ్....క్షమించండి" అంటూ కమల్ పరుగు తీశాడు.

అంతే....అంతే....అంతే.


శ్రీరామచంద్రుడిలా జీవితాంతం తన అర్ధాంగి జ్ఞాపకాలతో గడపాలనుకున్నాడు. షాజహాను నిర్మించిన తాజమహల్లా-శిరీష జ్ఞాపకార్థంగా ఓ నర్సింగ్ హోం కట్టించాలనుకున్నాడు. చరిత్రలో ఎందరో ప్రేమికుల్లా అతనూ జీవితానికి ఓ అందమైన నిర్వచనం చెప్పాలనుకున్నాడు.

ఆ రోజే అలా అనుకున్నవన్నీ తన స్మృతిపథంనుండి తుడిచివేశాడు.

ఆ క్షణమే - శిరీషను తన మనసునుండి నిర్దాక్షిణ్యంగా చెరిపివేశాడు.

* * *

తన భార్య శీలవతి కావాలని ప్రతి మగవాడూ కోరుకుంటాడు. అది తప్పు




కాదు. అయితే — ఆమె తప్పు చేసినా, ఆమె శీలవతి కాదని తెలిసినా కొందరు భరించలేక ఆత్మాహుతి చేసుకోవచ్చు. మరికొందరు అసహ్యించుకొని, గతాన్ని మరిచిపోవటానికి ప్రయత్నించవచ్చు.

ప్రవీణ్ గతాన్ని మస్తిష్కంలో ఊడ్చిపెట్టాడు.

అందుకే, అతను అతి తొందరలో మామూలు మనిషిగా కోలుకోగలిగాడు. హాస్పిటల్‌కి వెళ్లి వస్తున్నాడు. అందరితో సరదాగా గడుపుతున్నాడు. జీవితంలో అదృష్టాలకోసం ఆలోచిస్తున్నాడు. ఆ ఇంట్లో మునుపటి కళాకాంతులు కనిపిస్తున్నాయి.

ఎప్పట్నుంచో తనమీద మనసు పెట్టుకున్న మేనమామ కూతురు నిర్మలతో సలక్షణంగా ప్రవీణ్‌కి మళ్ళీ పెళ్లి జరిగిపోయింది. పై చదువులకోసం రమ్మని విదేశాలనుండి పిలుపు రాగా బయలుదేరాడు.

ఆ రోజు —

ప్రవీణ్ కొత్త వధువుతో విమానం ఎక్కబోయేముందు ఎయిర్ పోర్టుకి వచ్చిన జయతో — "ఒక నిజం చెప్పి, నన్ను మనిషిగా చేశావు. నాకు మళ్ళీ జీవితాన్ని ప్రసాదించావు. నీకు చాలా థాంక్స్ జయా....వస్తాను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. కన్నీళ్లు వచ్చాయి.

"జయా! నువ్వు చిన్నదానివి. లేకుంటే - నీకు చేతులెత్తి దండం పెట్టేవాణ్ని. ఆ రోజు నువ్వు ఏం చెప్పావో మాకు తెలీదుగాని వాడు అప్పట్నుంచే మారేడు. ఈ రోజు వాడి ఉన్నతిని చూసి గర్విస్తున్నామంటే - అది నీ గొప్పతనమేనమ్మా" ప్రవీణ్ తండ్రి జయ తలను ఆప్యాయంగా, కృతజ్ఞతగా నిమిరారు.

ఆమె మాట్లాడలేదు. కన్నీళ్లు వచ్చాయి.

ప్రవీణ్ తల్లి జయను గుండెలకు హత్తుకుంది - "నువ్వు మా యింట్లో దీపం వెలిగించావు తల్లీ. నీకు ఋణపడి ఉన్నాం...."

ఆమె మాట్లాడలేదు. కన్నీళ్లు వచ్చాయి.

కన్నీళ్ళు....కన్నీళ్ళు....కన్నీళ్ళు.

ఆమె కన్నీటి వెనుక అర్థం ఒకరికీ తెలీదు.

ఏ పాపం ఎరుగని నిప్పులాంటి శిరీష శీలానికి మచ్చపెట్టి, ఓ కట్టు కథ చక్కగా అల్లి ప్రవీణ్‌ని నమ్మించిందని ఎవరికీ తెలీదు. తన స్నేహితుడు కమల్ సాయంతో ఉత్తరాలు సృష్టించి, ప్రవీణ్‌లో జుగుప్స కలిగించడంకోసం కమల్ దెబ్బతిన్నాడని ఎవరికీ తెలీదు. ఆడదాని పవిత్రతమీద రంగులు పూసి, మగవాడి మనసులో అనుమానాలు పుట్టిస్తే — ఇలాగే జరిగిందని ఎవరికీ తెలీదు.

అందుకే, జయకి కన్నీళ్లు వస్తున్నాయి. అవి ఆగడంలేదు. ఆ కన్నీళ్లు ఆమెను మాట్లాడనివ్వడంలేదు.

"అక్కా! నన్ను క్షమించు....నేను నేను...అయాం డయబాలికల్లీ యువర్స్' అని జయ మనసు మూలిగింది.

